కథా నిలయం
శ్రీకాకుళం

# పారిజాతం

క్రగేటు తెరచి కాంపౌండులోకి అడుగుపెట్టగానే - వృక్షంలా పెరిగిన పారిజాతం నీడ; కోలముత్యాలలా నల్లనినేలమీదమెరిసే రాలిన పారిజాతాలు, గుబురుగా పెరిగి విరిసిన మల్లెలతో కళ్ళకు విందుచేసే మల్లెపందిరి, రంగు రంగుల గులాబీలు, కెంపులు పూసిన వృక్షంలా బోగన్ విలియా. రాత్రయ్యేసరికి దారినపోయేవాళ్ళని నిలబెట్టే నైట్ క్వీన్ అర్చి - రాళ్ళలోకూడ రసజ్ఞతని సృష్టిస్తాయి.

ఆ అందం మధ్యనుంచి నాలుగడులు వేస్తే—పారిజాతం యిల్లు. ఎదర కటకటాలమర్చిన వరండా — వరండాలో నాలుగు పేముకుర్చీలు, వాటిముందు చిన్న టీపాయ్, టీపాయ్ మీద ఎర్రగులాబీలు పేర్చిన ఫ్లవర్ వాజ్. వరండానిచేరి పారిజాతం పడకగది. గుమ్మానికి నీలితెర —గాలికి కృష్ణలోని అలల్లా ఆడుకుంటూ వుంటుంది. ఆ ఆటలో గదిలోనుంచి తియ్యని సెంటువాసనల్ని మోసుకొచ్చి బయటి పూలవాసనలతో కలుపుతూ వుంటుంది. గదిలో—పిసరంత మేరైనా కనబడకుండా పరచబడిన తివాసీ, విశాలమైన మెత్తని పరుపుల్ని మోస్తోన్న పందిరిపట్టు మంచం, నిశ్శబ్దంగాతిరిగే ఫేను, ఎదురుగా టేబులుమీద గంభీరంగా అగుపించే రేడియో, పక్కనే అందంగా అగుపించే మురళీ కృష్ణుని బొమ్మ— వీటన్నిటినీ తడుపుతూ నీలివెలుగు. ఈ అలంకరణలన్నీ

కృష్ణశాస్త్రిగారి కాలంనుంచీ ఆయింట్లో వున్నవే. ఆ గదిలోవున్న పారిజాతాన్ని చూస్తే యోగులుసహితం భోగులు కావాలనుకుంటారు.

రోజుకి వందకాయితం పేల్చేసే లారీలబ్బాయి 'డాబా యింటిని మేడచేయిస్తాను. ఏమంటుందో కనుక్కో' అని అనేకసార్లు కబురు పంపాడు. అయినా లాభంలేక పోయింది.

ఎందుచేతంటే, శర్మ, రాజు, చౌదరి ప్రాపకంలో పారిజాతం వున్నన్నాళ్ళు ఆమెని కన్నెత్తి చూడ్డానికి ఎవరికి దమ్ములుండవు. వాళ్ళ పడగల నీడ అలాంటిది.

ఆ ముగ్గురూ జుట్టూ జుట్టూ పట్టుకోకుండా ఎంతో చాకచక్యంతో గడుపుకొస్తోంది కాలాన్ని.

శర్మ, రాజు, చౌదరి పారిజాతంముందు పసిపిల్లలా అయిపోతారు. శర్మ మట్టుకు శర్మ— మిగిలిన యిద్దరికంటె తనంటేనే పడిచస్తుందనుకుంటాడు. అలాగే మిగతా యిద్దరూ— గొడవలు, తగాదాలు లేకుండా పారిజాతం ఏర్పరచిన టైంటేబిల్ ప్రకారం ఆ ముగ్గురూ ఆమెతో గడుపుతారు. ఆదివారం మాత్రం అందరికి శలవే. ఆరోజున పారిజాతం వుపవాసం వుంటుంది.

సోమవారం తెల్లవారు ఝామున శర్మ యింటికెళ్ళబోయే ముందు 'మళ్ళీ నే కబురంపేదాకా — మీరు రాకూడదిక్కడికి' అంది పారిజాతం. శర్మ చటుక్కున వెనక్కితిరిగి, నేనేం తప్పుచేశానన్నట్లు చూశాడు, ఆమె కొంటెగా నవ్వి 'తప్పదు' అంది.

'నాకేనా యీ శిక్ష? వాళ్ళిద్దరికి కూడానా?'

'శిక్షఅయినా సుఖమైనా, ముగ్గురుకీ సమానమే పారిజాతం దగ్గర'

'ఇంతకీ కారణం?'

"పదమూడేళ్ళ తర్వాత మా తమ్ముడు మద్రాసునుంచి వస్తున్నాడు ఆరునెలల్లో యికవాడు డాక్టరు అవుతాడట."

"గుడ్, అలాగైతే, బాబ్జీ వెళ్ళిపోయాక కబురంపించు" అని చెప్పి శర్మ వెళ్ళిపోయాడు.

పారిజాతం చాలాసేపు అలాగే నిల్చుండి పోయింది. ఆతర్వాత కదిలివెళ్ళి మంచంమీద వాలిపోయింది.

గాలి తనచుట్టూ వున్న వాతావరణంమీంచి, తనమీంచి, మరో పక్కకి వీచింది. అమ్మ, అమ్మకి వూహతెలిసి బతకనేర్చిన నాటినుంచీ ఆదరించి చేరదీసిన కృష్ణశాస్త్రిగారు - అంటే చట్టం వప్పుకోకపోయినా నిజం అంగీకరించే నానగారు - వాళ్ళిద్దరు తనగురించి, తమ్ముడి గురించి కట్టుకున్న వూహలమేడలు-నాన్నగారి మెత్తని మనసు-ఆయన తనకు పెళ్ళిచేస్తాననటం, బాబ్జీని ప్రయోజకుడ్ని చేయాలని అమ్మతో అంటూండడం-అనుకోకుండా ఆయన పోవడం, ఆయనతోబాటే అమ్మ 'నాకిక్కడేం పనన్నట్లు' తననీ, తమ్ముడ్నీ వదలిపోవడం_అన్నీ ఒకదాని తరువాత ఒకటి రంగుల రాట్నంలా కళ్ళముందు కదిలాయి పారిజాతానికి. అమ్మ కన్నుమూయబోయేముందు 'తమ్ముడ్ని నీ కప్పచెబుతున్నాను. వాడ్ని నువ్వు మీ నాన్నగారంతవాడ్ని చెయ్యాలి.' నువ్వు మన సాటివాళ్ళలా కాకుం... అంటూ మాటపూర్తికాకుండానే తనని యింటికి పెద్దదాన్ని చేసిన సంఘటన గుర్తుకొచ్చింది ఆమెకి.

అమ్మ ఆశించినట్టే బాబ్జీని తను తనకు చేతనయినంత పెద్దవాడ్ని చేసింది. కాని తనుమాత్రం అమ్మకోరిక తీర్చలేక పోయింది. తమ్ముడి కోసం తను అమ్మకోరిన దానికి విరుద్ధంగా బతకక్క తప్పలేదు.

'రేపు తమ్ముడొస్తాడు. తమ్ముడు వచ్చేటప్పటికి యీ వాతావరణం యేమీ కనపడకూడదు. తొమ్మిదేళ్ళు వచ్చేదాకా యిక్కడే పెరిగాడు___ ఆ తరువాత యిక్కడే వుండివుంటే, నారిగాడిలా'... ఆవూహ మనసులో చోటుచేసుకోగానే ఆమె వణికిపోయింది. 'అలా వాడు కాకూడదు. ఎన్నడూ వా డలాకాకూడదనే వాడికోసం తన నచ్చనిపనిని నచ్చినట్టు నటిస్తూ యింత కష్టపడింది. వేశ్య పుట్టడంకంటె వేశ్యయింట్లో మగాడిగా పుట్టడం మరీ నరకం. అందుకే అన్నీ తెలిసిన అమ్మ నాకంతగా వప్పచెప్పి మరీ పోయింది. అమ్మకోరిక తీర్చాను. అదే నాకు తృప్తి. బాబీ డాక్టరు కాబోతున్నాడు. డాక్టరు

బాబీ... నా తమ్ముడు. కాని-డాక్టరు బాబీ అక్క... ఒక సాని. పది మందిలో తలెత్తుకు నిలబడలేని కులట - పరువంటే తెలియని బజారు మనిషి'... అని తననితాను కించపరుచుకుంటూ, వెక్కి వెక్కి ఏడుస్తూ నిద్రపోయింది పారిజాతం.

ఉదయం తొమ్మిదిగంటలకి కాని ఆమెకి మెళకువ రాలేదు. మెళకువ రాగానే 'మూడుగంటలకి బాబీ వచ్చేస్తాడు. యీలోగా యిల్లంతా సర్దాలి. ఎక్కడా నా బతుకువాసన తగలకూడదు. నా పిచ్చిగాని— తొమ్మిదేళ్ళొచ్చేదాకా యిక్కడే, నాదగ్గరే పెరిగినవాడేగా— నాబతుకు వాడికి కొత్తా? జ్ఞాపకం వుండకుండా పోతుందా? లారీలబ్బాయి వాడి చేతనేగా నాకు మొదటిసారి కబురంపింది. ఆ మర్నాడేగా వాడ్ని మద్రాస్ తీసుకెళ్ళి, నాకుదూరంగా... హాస్టల్లో చేర్పించింది - వాడికి నా బతుకంతా గుర్తుంటుంది. వానలో తడిసి పొడిగావున్నట్లు నటించాలనుకోవడం నాదే తెలివితక్కువ' అనుకుంది పారిజాతం.

కాని మనసు వూరుకోలేదు. 'ఎందుకైనా మంచిది. వాడి మనసుకి యే మాత్రం నొప్పితగలకూడదు, వా డిప్పుడు అందరిలాంటివాడు కాదు. నా బాబీ...డాక్టర్ బాబీ' అనుకొని, త్వరత్వరగా యిల్లంతా సర్ది. రాజుకి, చౌదరికికూడా తిరిగి తను కబురు పంపేదాకా రావద్దని, నాయుడుచేత కబురుచేసింది.

ఆమెమనసుకి నిలకడలేదు. నిముషమొక యుగంగా గడుస్తోంది. యింకో గంటలో రైలువస్తుంది, స్టేషనుకివెళ్ళి బాబ్జీని స్వయంగా యింటికి తీసుకురావాలనిపించింది ఆమెకి. కాని తనతో బాబ్జీని చూస్తే, జనం వాడ్ని చులకనగా చూస్తారనిపించి, ఆ వుద్దేశాన్ని మార్చుకుంది. పదమూడేళ్ళ తరువాత బాబ్జి తనయింటికి వస్తున్నా, వాడంతట వాడు రావలసిందేగాని నే నెదురువెళ్ళి తీసుకురావడానికి నోచుకోలేదనుకొని దిగాలుపడింది పారిజాతం.

బాబ్జీతోపాటు, అతని స్నేహితుడు- రూమ్‌మేటు అయిన రజనీ కూడ వస్తున్నాడు. రజనీ బాబ్జీనీడలో బతికేమనిషి. బాబ్జీ పెద్దవంశానికి చెందినవాడనీ, వున్నవాడని రజనీ అభిప్రాయం.

'నిన్ను రిసీవ్ చేసుకుందుకు ఎవరూ రాలేదేం?' అన్నాడు రజినీ రైలుదిగి.

'బయలుదేరిన వాళ్ళం యింటికి చేరమనా? అదికాకపోయినా యిదేమయినా మహానగర మనుకున్నావా? యిలాంటి ఆడంబరాలకి' అన్నాడు బాబ్జీ.

పదమూడేళ్ళ తరువాత బాబ్జీ ఆ వూరుకి వస్తున్నాడు. అంతా కొత్తగా అనిపిస్తోందతనికి. వుత్తరాలు రాస్తూవుండడంచేత యింటి అడ్రసుమాత్రం జ్ఞాపకముంది. రిక్షాఎక్కి 'పల్లపువీధికిపోనీ' అన్నాడు బాబ్జీ.

రిక్షా వీధికి దగ్గరౌతోంది. బాబ్జీమనసులో గతమంతామసకమసకగా మెదులుతోంది. రజనీతో ఏమీ మాట్లాడలేకపోతున్నాడు. ఏదో భయం, గజిబిజి ఆలోచనలు, మనసంతా గందరగోళంగా — మాటలకందని అస్తిమితాన్ని అతని మనసు అనుభవిస్తోంది.

'ఎవరింటికి బాబూ' అన్నాడు రిక్షావాడు.

ఘోషిస్తోన్న సముద్రంలో పిడుగు పడ్డట్టయింది బాబ్జీకి. పొడారిపోయిన పెదవులు 'పోనీ, నేను చెబుతాను' అన్నాడు ముక్తసరిగా

రిక్షా ఆవీధిలోకెళ్ళింది - పల్లపువీధి- యింటి ఆకారంలో యేమీ మార్పులేదు. సులువుగానే గుర్తుపట్టాడు బాబ్జీ.

'ఆడాబా యింటిదగ్గర ఆపుచెయ్' అన్నాడు బాబ్జీ.

రిక్షా దిగి, సూట్ కేస్ తీసుకొని, రజనీకోసం చూడకుండా, యాంత్రికంగా, బొమ్మలా — కీయిస్తే కదిలే బొమ్మలా లోపలి కెళ్ళిపోయాడు. వెనకే రజనీ...

వాళ్ళవెనక నీలితెర చిరాగ్గా రెపరెప కొట్టుకుంది. బాబ్జీ కళ్ళముందున్న పారిజాతం బాబ్జికి, వేసవిశలవుల్లో మద్రాసు వచ్చి కలిసే అక్కలా అగుపించలేదు. ఆమెను చూస్తూ, కొయ్యమనసుతో కొయ్యబొమ్మలా నిలబడ్డాడు బాబ్జీ. ఏవిధమైన ఆత్మీయత, అభిమానం అతని మనసులో పుట్టుకురాలేదు. తాను మద్రాస్ వెళ్ళినప్పుడు తుళ్ళిపడే కెర

టంలా తనముందుకువచ్చే తమ్ముడు, విరిగిన అలలా తనముందు వుండే సరికి పారిజాతం మనసు చివుక్కుమంది. అయినా ఆమె మనసులోంచి పాలపొంగులా మమత, మమకారం ఒక్కసారీ పెల్లుబికాయి. ఆమె తట్టుకోలేక 'వచ్చావా బాబీ!' అంటూ చేతులు చాచింది.

బాబ్జి అడుగు ముందుకు వేయలేదు. ఆమె తమ్ముణ్ని తల్లిలా సందిట్లోకి తీసుకుంది.

పాము చుట్టుకున్నట్లనిపించింది బాబ్జికి. సందిట్లోంచి విదిలించుకుని, 'యితను రజనీ, నాస్నేహితుడు. యీవిడ మా అక్క' అని పరిచయం చేసాడు.

అతను పక్కనుండడంచేత, యిబ్బందనిపించి తన సందిట్లోంచి బాబీ విదిలించుకున్నాడని సరిపెట్టుకుంది.

ఆ రోజంతా ముభావంగానే వున్నాడు బాబ్జి. అక్కతోను,రజనీతోను కలిసికట్టుగా వుండలేకపోయాడు, అతని మనసు అతనిలోలేదు_వెనక్కి, పదమూడేళ్ళు వెనక్కి వెళ్ళి వేటినో వెతుక్కుంటోంది.

బయటికి వెళ్ళడానికి అతనిలో ఏదో భయం-రోజంతా యింట్లోనే వుండిపోయాడు. రజనీని తనతో తీసుకువచ్చినందుకు లోలోనే బాధ బడ్డాడు.

రాత్రయేసరికి ఆ వీధి వాతావరణం _ బేరాలుకుదిర్చే నారిగాడు - ఆగే రిక్షాలు, గుమ్మాలముందు అలంకరించుకుని నిల్చున్న ఆడవాళ్ళు, అటూ యిటూచూసి ఏదోయింట్లోకి కంగారుగా దూరే మగవాళ్ళు - బాబ్జీ కళ్ళముందు కదిలారు. యిదంతాచూసి, రజనీ తనగురించి ఏమని అంచనా వేసుకుంటాడో - తన పరువు ఏమౌతుందో అని బాబ్జీమనసు కంగారు కంగారుగా వుంది.

కష్టంమీద ఒకరోజు గడిచింది. అంతవరకు రజనీ బాబ్జీయింట్లోంచి కదల్లేదు. ప్రయాణబడలిక తీరడంతో రజనీకి కాస్త బయటికెళ్ళాలనిపించింది ఆ సాయంత్రం. 'సినిమాకి వెడదామా' అన్నాడు రజనీ. 'ఇక్కడ హాల్స్ అంత బాగోవురా' అని తేల్చేసాడు బాబ్జీ.

'పోనీ అలాఓసారి బయటకెడదాం. వచ్చినప్పటినుంచి మనం గడప దాటలేదు, అన్నాడు రజనీ.

ఎలా తప్పించుకోవాలో అర్థంకాలేదు బాబీకి. రజనీతో కలసి బయటకెడితే, తనని ఎవరేనా గుర్తుపట్టి యేంనోరు జారతారో, తన పరువు ఎక్కడ గాజుపెంకులా ముక్కలౌతుందోనని లోలోపల మధనపడుతున్నాడు బాబ్జీ.

ఇంతలో పారిజాతంవచ్చి, 'బాబీ వంట్లో బాగోలేదేమో, అదికాకపోయినా యీవూళ్ళో బాబీకంతగా తిరిగే అలవాటులేదు' అంది. బాబ్జీ అక్క ముఖంలోకి యిబ్బందిగా చూసాడు.

'సరేలెండి. నే వెళ్ళి అలా తిరిగి వస్తాను' అని రజనీ బయట కెళ్ళాడు.

బాబ్జీ మనసు సున్నంలా వుడికిపోతోంది. దేనిమీదో అతనికి కోపం. మనసునిండా అశాంతి.

పారిజాతానికి తమ్ముడి మనసు గ్రహించడానికి ఆట్టేసమయం పట్టలేదు.

'బాబీ, నువ్వు ఒక్కడివే రావలసిందయ్యా' అంది.

'ఔను' అని, 'నేనుకూడా రాకుండా వుండాల్సింది' అనుకున్నాడు మనసులో.

'అంతేగాదు బాబీ! నువ్వుకూడ యిక్కడికి రాకూడదనే నా ఉద్దేశం'

'యేం?' అన్నట్టు ఆమె ముఖంలోకి చూసాడు బాబి.

'అవును బాబీ! యీ అక్క నీకు దూరంగావుండి, నీక్కావలసిన అవసరాలను తీరుస్తూ వుంటేనే అక్కగాని, నువ్వు నాకు దగ్గరగావచ్చి నీ అక్క బతుకును కళ్ళారాచూస్తే యీ అక్కమీద అసహ్యం పుడుతుంది బాబీ? నీతోటి వాళ్ళకి నీఅక్క అసలు రంగు తెలిస్తే నువ్వు భరించలేవు బాబీ.'

'అక్కా' అన్నాడు బాబ్జీ, ఆపిలుపులో అక్కమనసుని నొప్పించానన్న బాధ వుంది.

'నువ్వేకాదు బాబీ, ఏ తమ్ముడైనా, నీ స్థితిలో వున్నవాడు తన అక్క బజారులో వళ్ళమ్ముకొని బతికే మనిషని పదిమందికి ఎక్కడ తెలుస్తుందోనని భయపడుతూనే వుంటాడు బాబీ'

బాబ్జీమనసు మూగబోయింది. బాధ, అభిమానం, సిగ్గు, పశ్చాత్తాపం, నిస్పృహాయత ఒకదానితో ఒకటి అల్లుకుపోయి మనసుని చిందర వందర చేసాయి. అతనికి నోట మాటరాలేదు.

'అందుకే, నువ్వు నీ స్నేహితుడితో కలసి యీ యింట్లో అడుగు పెట్టినప్పటినుంచి, ఎక్కడ యేసంఘటన నీమనసుని గాయపరుస్తుందోనని నేను వూపిరికూడ గట్టిగా పీల్చుకోకుండా-అరచేతిలో గుండెలు పెట్టుకుని వున్నాను బాబీ' అంది పారిజాతం. అప్పటికే ఆమె కళ్ళు నీళ్ళతోనిండాయి, గొంతు బొంగురు పోయింది.

యేదో చెప్పాలనివున్నా మాటలు దొరకక, పసివాడిలా 'అక్కా!' అంటూ ఆమెవడిలో తల దాచుకున్నాడు బాబ్జీ.

పారిజాతం హృదయం ఆప్యాయతతో చెమ్మగిల్లింది. అతని తల నిమిరి 'లే బాబీ! పెట్టె సర్దుకో. యీరాత్రికే మనం యిక్కడినుంచి వెళ్ళిపోదాం. యీ వాతావరణానికి దూరంగా వెళ్ళిపోదాం. మరోవూళ్ళో నిశ్చింతగా నాలుగు రోజులుండి అక్కడనుంచి మద్రాసుకిపోయి నిన్ను వదలి, నే నింటికి తిరిగివస్తాను' అని లోపలికెళ్ళింది పారిజాతం. కళ్ళు తుడుచుకొని బట్టలు సర్దుకోసాగింది.

చీకటి రెక్కలు విప్పుకొంటోంది. ఆవీధి నెమ్మదిగా మేల్కొంటోంది. కొత్తసొంపుని పుంజుకుంటోంది. చౌకబారు సువాసనలు ఆవీధిలోని గాలిని యిబ్బంది పెడుతున్నాయి. రజనీ కాసేపు ఎటో తిరిగి ఆ వీధి మొగలోకి వచ్చాడు. పల్లపువీధి గమ్మత్తుగా అగుపించిందతనికి. అటూ యిటూ చూస్తూ కులాసాగా నడుస్తున్నాడు. నారిగాడు ఏదో కొత్త బేరమనుకుని, ఒక్క పరుగున దగ్గరకొచ్చాడు.

'ఏమిటి?' అన్నట్లు చూశాడు రజనీ.

చేతులు నలుపుతూ, 'సంపంగి కూతురు రోజాకాడ కెడతారా? మంచి అందగత్తె' అన్నాడు నారిగాడు.

లోలోపల కుతూహలంగావున్నా, చిరాగ్గాచూసి, ఒక్కఅడుగు ముందుకేసి పారిజాతం యింటివైపు తిరిగాడు రజనీ.

'బాబ్బాబు ఆయింటికెల్లకండి. అది పైబేరాలొప్పుకోదు. దానియన్నీ పెరమనెంటు కాతాలే' అన్నాడు నారిగాడు వెంటబడి.

ఏం సమాధానం చెప్పకుండా, సిగరెట్టును బూటికాలితో నలిపి లోపలి కెళ్ళిపోయాడు రజనీ. గుమ్మానికున్న నీలితెరదాకావెళ్ళి ఆగాడు.

'అయితే బాబ్జి మెరుపు **జీవితంవెనక** యింతటి నల్లని మబ్బు వుందన్నమాట. లేకపోతే అంత మెరుపెక్కడినుంచి వస్తుంది?' అనుకున్నాడు.

రజనీ సిగరెట్టు ఆరిపోయింది. తెరని వత్తిగించి లోపలికడుగు పెట్టిన రజనీకి వంటరిగా సోఫాలో కూర్చున్న బాబ్జి, సర్దిన సూట్ కేసు, బెడ్డింగు కనిపించాయి. "సూట్ కేస్ సర్దుకో రజనీ! యీ రాత్రికే ప్రయాణం. అక్క, నేను వూటి కెడుతున్నాం. నువ్వు మద్రాసుకి పోదువుగాని' అన్నాడు బాబ్జి. "మీ బావగార్ని చూడకుండానే" అన్నాడు రజనీ అగ్గిపుల్లను ఆర్పుతూ. బాబ్జి గుండెలు భగ్గుమన్నాయి. చెంప ఛెల్లుమనిపిద్దామను కున్నాడు. కోపంతో ఊగిపోయాడు. తన పరువుని ఆరిపోయిన అగ్గిపుల్లలో చూసుకుని గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. యిదంతా ఒక్కక్షణంలో జరిగిపోయింది.

పారిజాతం లోపలినుంచి వచ్చింది. 'వారు వూటీనుంచి వైర్ యిచ్చారు అక్కడికి తక్షణం బయలుదేరి రమ్మని' అనిచెప్పి యింక నిలబడకుండా లోపలికెళ్ళిపోయింది.

రజనీని బాబ్జి తనతో వూటీ రమ్మనలేదు. రజనీకి అదికూడ మంటగావుంది. 'అంత అందమైన అక్క బజారునపడి రెండుచేతులా

సంపాదిస్తుంటే ఎన్ని షోకులైనా వెళ్ళబొయ్యవచ్చు, ఎన్ని వేసవి విడుదులేనా తిలకించొచ్చు' అనుకున్నాడు రజినీ రైలుఎక్కుతూ.

బాబ్జి అక్కతో కలిసి వూటీకి వెళ్ళి నాలుగురోజులుండి, అక్కడ నుంచి యిద్దరూ కలిసి మద్రాస్ వచ్చేశారు. యేటా వేసవిలో బాబ్జిని చూడటానికి వచ్చినప్పుడు దిగే హోటల్లోనే దిగింది పారిజాతం. మరిరెండు మూడు రోజులుంటానని, రోజూ ఒక్కసారైనా వచ్చి కలిసి పొమ్మని చెప్పింది బాబ్జితో.

బాబ్జి హాస్టల్‌కి వెళ్ళాడు. హాస్టల్‌లోకి అడుగుపెట్టి కేరిడార్‌లో నడుస్తూవుంటే, అతని గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఎదురయ్యే స్నేహితులు అతన్ని వింతగా కొత్తగా చూస్తున్నట్లనిపించిందతనికి. ఏదో భయం, చిన్నతనం అతని మనసును ఆవరించాయి.

ఇంతలో రజినీవచ్చి, 'యేం అలా డల్‌గా వున్నావ్ ? అక్కయింటికెళ్ళిపోయారా ?' అన్నాడు మామూలు ధోరణిలో. "నాతోయిక్కడికేవచ్చింది, యిదివరలోదిగే హోటల్‌లోనే దిగింది." అన్నాడు బాబ్జి ముక్తసరిగా.

ఇంతలో, యిదివరలో బాబ్జితో సెక్రటరీకి పోటీచేసి ఓడిపోయిన నాగరాజు లోపలికివస్తూ, బాబ్జినిచూడకుండా 'యేం రజినీ! మీ బావమరిది వచ్చాడా ?' అని, బాబ్జిని చటుక్కున చూడ్డంతో, తబ్బిబ్బై బయటకెళ్ళిపోయాడు.

రజినీకి యింకా పెళ్ళికాలేదని బాబ్జికి తెలుసు. ఎవడు రజినీ బావమరది? అనుకున్నాడు బాబ్జి; అతనివళ్ళు ఉడికిపోతోంది.

రజినీ ముఖంలో రంగులు మారాయి. 'యీవేళ మార్నింగ్ మా మేనమామ గారబ్బాయి వచ్చాడులె' అన్నాడు రజినీ బాబ్జితో, ఏదో సర్దాలన్న ధోరణిలో.

'ఊఁ' అన్నాడు బాబ్జి పిచ్చిగుర్రంలా ముందుకురుకుతోన్న కోపానికి సహనాన్ని కళ్ళెంగా బిగించి. బాబ్జి కళ్ళు తెరుచుకొనివున్నా

అతనికేం కనపడ్డటంలేదు. అతని స్థితి అప్పట్లో అది. గుండెల్ని గట్టిగా పట్టి ఎవరో నొక్కుతున్నట్లనిపించిం దతనికి.

'ఒక వంద కావాలి బ్రదర్' అన్నాడు రజనీ.

బాబ్జి కళ్ళలో నిప్పులు కరుగుతున్నాయి, 'లేవు' అన్నాడు కటువుగా.

'అదేమిటోయ్! నీకు డబ్బుకు లోటేమిటి?'

"అంటే."

"దులిపితే డబ్బురాల్చే అక్కయ్య వుండగా...?

రజనీమాట పూర్తికాకుండానే, 'నోర్ముయ్' అంటూ బాబ్జీ రజనీని చెంపదెబ్బ కొట్టాడు. నిజానికి రజనీని కొట్టాల్సినంత అవుసరం ఆ మాటలో లేకపోయినా బాబ్జీ మానసిక పరిస్థితి, గుండెల్లో రగులుతున్న అనుమానం అతన్ని అలా తొందరపడేలా చేశాయి. ఆవేశం ఆలోచనిని చంపేసింది.

రజనీ కళ్ళనీళ్ళు తిరిగాయి. ఉక్రోషం కట్టలుతెంచుకుంది. అంతే! 'నా నోరు మూయించొచ్చు, కానీ లోకంనోరు మూయించలేవు. మీఅక్క బజారుమనిషని అందరికీ తెలుసు. ఆ సంపాదనతో నువ్వు బతుకుతున్నావని అందరూ ఎరుగుదురు' అంటూ విసురుగా వెళ్ళిపోయాడు రజనీ.

'రజనీ...' అని వెర్రికేక పెట్టాడు బాబ్జీ. బాబ్జీతల దిమ్మెక్కినట్టయింది. మెదడు కరిగిపోతోంది. నుంచున్నా, కూర్చున్నా పడుకున్నా అతనికి స్థిమితంలేదు. ఆవేశం ఆవిరై ఒంటినిండా కమ్ముకుంది. 'యీ బతుకు యింక బతక్కూడదు. తలెత్తుకుతిరగలేను. యిన్నాళ్ళుగా పెంచుకున్న పరువు, ప్రతిష్ఠ ఒక్కసారి చేజారిపోయి అద్దంలా ముక్కలయి పోయాయి' అనుకున్నా డతను.

అతని మనసుకు తెలిసిన నిజాన్నే మరొకళ్ళ నోటివెంట వినేసరికి అతనిమనసు తట్టుకోలేకపోయింది. మరొకళ్ళ నోటివెంటవిన్న నిజం భయాన్ని, బాధని కలిగిస్తోందతనికి. అతన్ని పిచ్చివాణ్ణి

చేస్తోంది. పిచ్చిగా, అసిమితంగా అటూయిటూ తిరిగాడు. షెల్ఫ్‌లోని స్లీపింగ్‌పిల్స్ సీసా పిలిచిందతన్ని. చేతికొచ్చినన్ని మింగాడు. పక్క మీద నడుంవాల్చాడు. స్లీపింగ్‌పిల్స్ అతన్ని, అతనిలోని ఆవేశాన్ని అదుపులోకి తీసుకున్నాయి.

రజినీ, నాగరాజుతోకలిసి గదిలోకి వస్తూ 'గెటప్ రాస్కెల్! నన్ను కొడతావట్రా? నువ్వెంత? నీ బతుకెంత?' అని నోరుపారేసు కుంటూ కసితీర్చుకుంటున్నాడు, ఇన్నాళ్ళు బాబ్జీ అతనిదృష్టిలో మహా వృక్షం, కాని యిప్పుడు గడ్డిపరక, నాగరాజు వింతని చూస్తూ తృప్తి పడుతున్నాడు.

బాబ్జీలో చలనంలేదు.

నాగరాజుకి యేదో అనుమానం కలిగి, దగ్గరకెళ్ళి చూసి 'స్పృహ లేదు' అన్నాడు,

'ఆఁ' అని స్తంభించిపోయాడు రజినీ, అతనికళ్ళు స్లీపింగ్ పిల్స్ సీసామీద పడ్డాయి. క్షణంక్రితం అతనిలో విజృంభించిన పిచ్చి కుక్కల్లాంటి చపలత్వాలు అలసి సొమ్మసిల్లాయి, ఏదోమూల మిణుకు మిణుకు మంటూన్న మానవత్వం వళ్ళువిరుచుకుని లేచింది, ఎవరికీ తెలియనివ్వకుండా ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌కి తీసుకెళ్ళి చేర్చారు బాబ్జీని. రజినీ స్వయంగావెళ్ళి పారిజాతాన్ని హాస్పిటల్‌కి తీసుకొచ్చాడు,

మరునాటి సాయంత్రానికి తెలివివచ్చింది బాబ్జీకి. బాగాతెలివి వచ్చినా పారిజాతంతో ఒక్కమాటా మాట్లాడలేదు బాబ్జీ. పైగా ఆమెని ఒకసారి చూసి మరోపక్కకి తిరిగిపడుకున్నాడు బాబ్జీ.

'బాబ్జీ! నేనేం తప్పు చేశానని నామీద నీకంత కోపం?' అంది పారిజాతం ఎదురుగావున్న తెల్లగోడని పొడికళ్ళతో చూస్తూ,

"నన్నక్కడే, మీఅందరిమధ్యనే బతకనివ్వక నన్ను మీకందరికీ ఎందుకు దూరంగా వుంచావు? ఎందుకింత బాగా పెంచావు?" అన్నాడు బాబ్జీ కోపంతో.

"అదే బాబ్జీ నాతప్పు."

గ్రంథాలయం శ్రీకాకుళం

"నేనెవర్నో వీళ్ళందరికీ తెలిసిపోయింది. నేను వీళ్ళమధ్య తలెత్తుకుని తిరగలేను, యీ అవమానాన్ని భరించలేను."

"నువ్వు తలెత్తుకు తిరగాలన్న ఆశతోనే నేను యిన్నాళ్ళు తల వంచుకొని బతికాను బాబీ. ఏది బాబీ నీకవమానం? నువ్వు నా తమ్ముడివి కావటమేనా నీ కవమానం?"

"అక్కా! అంతమాటనకు. మనం సానివాళ్ళమని వీళ్ళందరికీ..."

"పిచ్చి బాబీ, దానికి నువ్వు సిగ్గుపడాల్సిన పనిలేదయ్యా, మనల్ని ఈ సంఘం తన అవసరంకోసం ఏనాడో సృష్టించింది. ఆ సంఘానికి లేనిసిగ్గు మన కెందుకయ్యా?"

"నాకు అలా మొండికెత్తే ధైర్యం లేదక్కా!"

"నీకాధైర్యం లేకపోతే, పిరికివాడవైతే, వీళ్ళు నిన్ను రాబందుల్లా పొడిచి చంపేస్తారు. నువ్వు తిరగబడి నిలబడితే పిచ్చుకల్లా పారిపోతారు. అది సంఘం నైజం బాబీ. పిరికివాడిమీద స్వారీ చేస్తుంది, ధైర్యవంతుడికి సవారి అవుతుంది.

బాబి బరువుగా నిట్టూర్చాడు, ఆ నిట్టూర్పులోని నిస్పృహని పారిజాతం గ్రహించింది.

"పోనీ ఓపనిచెయ్యి బాబీ, నేను నీ అక్కనని తెలిస్తేకదా నీకవమానం. నువ్విప్పుడు డాక్టరువి. నేను నీ ఛాయలకు రాను. నీకు కనుపించను. నువ్వు ఎక్కడికేనా దూరంగా పోయి, నీవాళ్ళెవరూ లేరు గనుక నీకుతోచినట్టు చెప్పుకొని బతుకు బాబీ."

"అక్కా, నన్నింతవాణ్ని చేసి, నా కాలోచించుకునే శక్తి నిచ్చి మనిషిని చేశావు. నాకోసం యింత త్యాగంచేసిన నిన్ను నాదానివికాదని ఎలా వదలుకోనక్కా!"

"పొరబడ్డావు బాబీ! నాది త్యాగం కాదు. పచ్చి స్వార్థం. దొడ్లో మొక్కనాటి నీళ్ళుపోసి పెంచి, త్యాగమనుకుంటే ఎలా బాబీ? ఆచెట్టు నీడనీ, పళ్ళనీ యిస్తుందనేగా పెంచేది — నే బతికే మురికిగుంటలోంచి నువ్వు నన్ను వెలికితెస్తావని నే నిన్నాళ్ళూ నా శరీరాన్ని తాకట్టుపెట్టి

నీకు మధుపుపెట్టాను. ఈ చీకటిబతుక్కి వెలుగు లభిస్తుం దనుకున్నాను. నీ నీడలో ఏదో ఓమూలగదిలో పడుండి నిన్ను చూసుకుంటూ నా మిగిలిన జీవితాన్ని గడిపేద్దా మనుకున్నాను. నాలా మురికిలో మగ్గిపోకుండా మనవాళ్ళలోని ఓ ఆడదాన్ని కాపాడుతావనుకున్నాను. కాని నన్నూ, నా ఆశల్నీ దగాచేయడానికి సిద్ధమయ్యావు. నాకీ బతుకుతప్పదుకా మోసు బాబీ" అని గంభీరంగా అక్కడనుంచి లేవబోయింది.

ఆమాటలు వింటూంటే అతనిమనసు కరిగిపోయింది. ఆమె తనమీద పెంచుకున్న ఆశలు, తనకోసం ఆమెచేసిన త్యాగం, తలుచుకొనేసరికి అక్కమీద ఎక్కడలేని గౌరవంపుట్టుకొచ్చిం దతనికి, ఆమె మనస్సు తెలుసుకున్నతరువాత తనుచేసిన పొరపాటు తనకర్థమైంది. అక్క అండముందు చుట్టూవున్న లోకమంతా గడ్డిపరకలా కనబడింది. లేవబోయే అక్కచేతిని పట్టుకొని, తనరెండుచేతుల్లోకి తీసుకుని, ఆ చేతిమీద అతని తలని ఆన్చాడు.

ఒక్కసారి 'అక్కా' అని మృదువుగా, ఆప్యాయంగా పిలిచాడు. ఆ పిలుపులో 'నీకోసం బతుకుతానక్కా, నీకోరిక తీరుస్తా' నన్నభావం ప్రతిధ్వనించింది,